# ఎవరో ఏ గుమస్తా తెల్సు పిల్ల!



ఎం.ఏ. అంటే ఏమిటి?

—ఇది ఆనందపురంలో థౌజండ్ డాలర్స్ క్వశ్చన్ !

ఇది ఏ యింటర్వ్యూలోనూ అడిగిన ప్రశ్న కాదు-మరే పరీక్షాపత్రంలోనూ యిచ్చిన ప్రశ్న అసలేకాదు !

*　　*　　*

పోలీసులనూ ఖైదీలనూ మాత్రమే కాదు-విద్యార్థులనూ నంబర్లతో పిలుస్తారు.

కళాశాలల్లో అధ్యాపకులను నిక్‌నేమ్స్‌తోనే కాదు- 'పి.యస్.ఆర్.' 'కె. వి. ఆర్.' ఇలా పొట్టి పేర్లతోనూ పిలుస్తారు.

మాష్టర్లకు పొట్టిపేర్లలాగే డిగ్రీలకు బి.కామ్, ఎమ్.ఎ, బి.ఇ. ఇలా ఎబ్రీవియేషన్స్ వుంటాయి.

కాని ఇక్కడ ఎం. ఏ. అంటే డిగ్రీకాదు. అది ఆనందపురం కాలేజీలో చదువుతున్న ఓ ఆడపిల్ల సంక్షిప్త గుప్తనామం.

ఎం.ఏ. అసలు పేరు తెలుసుకోవాలనీ, ఆ అమ్మణ్ణి చూడాలనీ చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఆ మంది (ద) లో విద్యార్థులతో పాటు అధ్యాపకులూ వున్నారు.

ప్రతి గదిలో, ఎదఎదలో అదే రొద...

*　　*　　*

ఆంధ్రదేశంలో అనన్య సామాన్యమైన ప్రచారం గల వారపత్రికల్లో 'తెలుగుమన్ను' ఒకటి. ఆ పత్రికలో 'సమస్యలూ-సమాధానాలూ' శీర్షికను డా॥ జ్ఞానప్రసూనాంబ నిర్వహిస్తోంది. ఆ శీర్షికలో ఆవారం అచ్చయిన ఎం. ఏ. ఆనందపురం ప్రశ్న ఆ వూళ్ళో ఆలజడి కలిగించింది. ఆ ప్రశ్న చదివిన ప్రతి మగాడికీ 'ఎం. ఏ.'అంటేఎవరనేది 'పజిలు'గా పరిణమించింది."ఎం. ఏ"సమస్యచదివిన ప్రతి ఆడపిల్లకీ ఆ ప్రశ్నలో మగాడెవరనేది సమస్యగా తయారయింది!

ఇంతకీ ఆ సమస్య —

నా వయస్సు పదిహేడు సంవత్సరాలు. ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. ఇంకా పెళ్ళి కాలేదు. మొదటి చూపులోనే ఆయన నన్ను ఆకర్షించారు. ఆయన వైపు చూస్తుంటే,పాఠం వింటుంటే కాలం తెలీదు. ఆయనను గాఢంగా ఆరాధిస్తున్నాను. నేను నవలలు చదివినా, సినిమాలు చూసినా మా యిద్దర్నీ నాయికా నాయకులుగా ఊహించుకొని పరవశించి పోతుంటాను. ఆయన కౌగిలిలో నలిగి పోతున్నట్టు ఎన్నెన్నో కలలు...ఆ అనుభూతిలో...

కాని ఆయన వివాహితుడు. ఇద్దరు పిల్లలు కూడా-అని తెలిసినా యింకా ప్రేమిస్తున్నాను. తను లేకుండా బ్రతకలేననిపిస్తోంది. ఆయన ఒక్కరోజు క్లాసుకి సెలవు పెడితే మతిపోతుంది. విద్యార్థినిగా మాష్టారికీవిషయం ఎలా తెలియపర్చగలను? అక్కడికీ చాలాసార్లు డౌట్స్ నెపంతో ఆయన దగ్గర కెళ్ళాను. ఆయన చూపులు, మాటలు నన్ను మంత్రముగ్ధను చేస్తున్నాయి. కాని ఆయనకు నా పట్ల ఎలాంటి భావం వుందో తెలియదు. ఈ లోగా మా వాళ్ళు వేరే సంబంధాలు చూస్తున్నారు. మానసికంగా ఆయన కంకితమైన నేను వేరొకర్ని పెళ్ళాడి సుఖపెట్టగలనా? ఆయన అంగీకరిస్తే మా వివాహం సాధ్యమౌతుందా? ఆయన తోడు లేకపోతే జీవితం వ్యర్థమనిపిస్తోంది. ఆత్మహత్య తప్ప శరణ్యం లేదనిపిస్తోంది. నన్ను మీ సోదరిగా భావించి నా సమస్యకు తగిన పరిష్కారం సూచిస్తారని ఆశిస్తున్నా.

జవాబు : 'సోదరీ, ఈ సమస్య కేవలం నీది కాదు. సగటు ఆడపిల్లది. యౌవనంలో ఊహా ప్రణయం సహజం. అది సిగ్గుపడాల్సిన విషయం కాదు. 'లిబిడో' ప్రతి వ్యక్తిలోను ఉంటుందని 'ఫ్రాయిడ్' అనే మానసిక శాస్త్రవేత్త చెప్పాడు. ప్రేమ అనిర్వచనీయం. కృష్ణశాస్త్రి అంతటివాడు 'ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?'అని ప్రశ్నమార్కు దగ్గర ఆగిపోయాడు. ప్రేమకు ఎల్లలు లేవు. 'పెట్రార్క్' అనే ఇటలీ కవి 'లారా' అనే వివాహితను ప్రేమించి 336 గేయాలు రాశాడు. 1925 లో ఫ్రాన్సుకి చెందిన 18సం.రాల ప్రపంచ ప్రఖ్యాత సుందరి జరీనా అరవయ్యో పడిలోవున్న చిత్రకారుడు లాజరస్‌కి మూడవభార్య అయ్యింది. ఆంటోనీ చక్రవర్తి రోమురాజ్యం టైబరునదిలో కలిసిపోయినా లెఖ్ఖలేదుకాని— అందాలరాణి క్లియోపాత్రాను విడిచిపెట్టలేనన్నాడు... ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు.

కాని వివాహానికి కొన్ని ఆంక్షలున్నాయి. హిందూవివాహ చట్టంప్రకారం బహు భార్యాత్వం నేరం. ఆత్రేయగారు 'ఆత్మార్పణ' అనే నాటికలో ఓ న్యాయవాది పాత్రచేత హిందూ వివాహ చట్టానిది గాడిదబరువు అనిపించారనుకో. ఏది ఏమయినా మీ పెళ్ళికి ఆ చట్టం అడ్డొస్తుంది. మీకున్న మార్గాలు మతాంతరీకరణం, ఫ్రెండ్‌షిప్ కాంట్రాక్టు...కాని కోరి కష్టాలు తెచ్చుకోవద్దు. ప్రేమకు పరాకాష్ట త్యాగం. అందువల్ల మనసుతో రాజీపడి మీ పెద్దలు కుదిర్చిన సంబంధం చేసుకోవడమే ఉత్తమమని నా సలహా..."

సాధారణంగా ఇలాంటి స్వవిషయాన్ని... ముఖ్యంగా ప్రేమ వ్యవహారాల్ని రాసేవారు 'ఒకరు' అనో 'సోదరి' అనో రాయడంకద్దు. కాని ఈ ఆడపిల్ల అమాయకత్వమో,తెగింపో తెలియదు కాని పొడి అక్షరాల నివ్వడంవల్ల యింత అలజడిరేగింది. ఆనందపురం మహానగరమైతే పేరురాసినా అది సముద్రంలో నీటిబిందువేకాని అది పట్టణం,పల్లె కాని ఊరు. అక్కడున్నది ఒకే ఒక "కో-యెడ్యుకేషన్" కాలేజి. అందులో ఇంటర్మీడియట్ రెండేళ్ళుకలిపి 10 సెక్షన్లు మాత్రమే వున్నాయి. వాటిల్లోని ఆడపిల్లల పేర్లని జాగ్రత్తగా పరిశీలిస్తే- ఎం.ఏ. అనబడే "గోదాదేవి"ని కనిపెట్టెయ్యొచ్చు.

ఆ "లైలా" ఎవరై వుంటుంది?- అదే అందరి ఉత్సుకత !

* * *

పత్రికలు చదివే అలవాటున్న అధ్యాపకులంతా ఎం.ఏ. ఆరాధించే అర్హతల కోసం ఆత్మ పరిశోధన చేసుకున్నారు. అలా భుజాలు తడుముకొన్న గురువుల్లో రొమ్ము విరుచుకు నిలబడ్డవాడు వరదరాజు. అతను ఇంగ్లీషు లెక్చరర్. ఎం.ఏ. ఆరాధించే ఠీవీ, అందం- తనకి తప్ప ఆ కాలేజీ స్టాఫ్‌లో మరొకరికిలేవని అతని ప్రగాఢమైన విశ్వాసం.

వరదరాజు పేర్ల జాబితాలను దగ్గర పెట్టుకొని పరిశీలించాడు. "ఎం." ఇంటి పేరు మొదటి అక్షరమూ, "ఎ" అసలు పేరు మొదటి అక్షరమూ అయి వుండాలి. ఆ పరిశోధనలో అతనికి ఆ "కాంబినేషను"లో అరడజనుకి పైగా పేర్లు తటస్థ పడ్డాయి- అరుణ, అపర్ణ, అర్చన, అహల్య, అనుపమ వగైరా. ఆ నంబర్లూ, పేర్లూ గుర్తు పెట్టుకొని అటెండన్సు వేసేటప్పుడు వాళ్ళకేసి నిశితంగా చూసేవాడు. చేతబడి చేసేలావున్న ఆచూపును గమనించి క్లాసంతా ఏదో అర్థమైనట్టు నవ్వుకొనేవారు.

ఆ పేర్లుగల అమ్మాయిలనందర్నీ పరీక్షగా చూసిన తర్వాత... డౌట్స్ వగైరా చెప్పించుకొనే లక్షణాలు కలిగినవాళ్ళు యిద్దరు మిగిలారు- అపరంజి, అనుపమ. ఆ యిద్దరిలో అపరంజి నిజంగా అపరంజి బొమ్మే! ఆ అమ్మాయి ఎం.ఏ. అయివుంటే తన జీవితం ధన్యమైనట్టే. ఎం.ఏ. అంటే అపరంజే అయివుంటుందనే భావం స్థిరపడిన తర్వాత వరదరాజు ఆమెను చూపుల తూపులతో వేటాడుతున్నాడు. ఆమె భీతహరిణేక్షణై వయ్యారాలు ఒలకబోస్తుంటే- అది తనను కవ్వించడమేనని రాజు పళ్ళసందున నవ్వుకొనేవాడు. 'నిజానికి ఆడవాళ్ళకున్న తెలివితేటలు, ధైర్యం మగాళ్ళకుండవు. అపరంజి తన ప్రేమ విషయం సూటిగా చెప్పలేక పత్రికనడ్డెట్టుకొని తనకు తెలియజేసింది' అనే ఆలోచన బుద్ధుడికి జ్ఞానోదయమైనట్టు-వరదరాజు మెదడులో మెరుపులా మెరిసింది. ఇక ఏ మాత్రం ఆలస్యంచేయకూడదని నిర్ణయించుకొన్న రాజుకి మర్నాడు ఒంటరిగా డిపార్ట్‌మెంటులోకూర్చున్న సమయంలో అపరంజి రావడంఊపిరిపోసింది.అయితేఅపరంజి మాత్రం ఒంటరిగా రాలేదు-ఓ అప్పలమ్మను వెంట బెట్టుకొని వచ్చింది. అపరంజి'ఎస్సేలు' దిద్దించుకోడాని కొచ్చింది—కాని వరదరాజు దృష్టి అక్షరాల మీద నిలబడ్డం లేదు. "మరీ తప్పుల తడకలు. ఇంటికి రాకూడదూ? అన్నీ మొదటి నుంచీ చెపుతాను"ఎదురుగా నిల్చొన్న అపరంజి పాదాలను టేబుల్ కింద నుంచి అతని పాదాలు తాకుతున్నాయి.

"కాలేజీకి తప్ప ఎవరింటికి వెళ్ళినా మా అమ్మ తిడుతుంది మాష్టారూ" అంటూ దూరంగా జరిగి నిల్చొంది అపరంజి.

"నేనొస్తాను మాష్టారూ. ఎప్పుడు రమ్మంటారు?"అప్పలమ్మ పళ్ళికిలిస్తూ సంసిద్ధతను వ్యక్తం చేసింది.

"నాకిక్కడ దిద్దడం వీలుకాదు మరి"అపరంజికి పుస్తకం తిరిగి యిచ్చాడు. అప్పలమ్మ మాటల్ని అసలు వినిపించుకోలేదు. అమ్మాయిలిద్దరూ గుసగుస లాడుకొంటూ వెళ్ళిపోయారు. ఎం. ఏ. అంటే ఈ దళసరి చర్మం అమ్మాయి మాత్రం అయివుండదు అని అర్థమయింది వరదరాజుకి !

ఇక మిగిలివున్న ఒకే ఒక అమ్మాయి అనుపమ. అనుపమ అపరంజి అంత అందమైంది కాకపోయినా చురుకైన అమ్మాయే. వాళ్ళు ఉండేది కూడా వరదరాజు వుంటున్న వీధిలోనే.

వరదరాజు శ్రీమతి పుట్టింటికివెళ్ళిన రోజునే అనుపమ డౌట్స్ పేరుతో యింటికి రావడం అతని వూహకు బలాన్నిచ్చింది. పాఠం మానేసి మాటల్లోకి దింపాడు.

"అవును. అను- ఇంత చనువుగా ఉంటున్నాం. నాతో చెప్పొచ్చుగా. అందరికీ వెల్లడయ్యేలా పత్రికలో ఎందుకు రాశావలా?" ఆమె కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూస్తూ అడిగాడు.

పత్రికేమిటి— నేను రాయడమేమిటి మాష్టారూ?"

"అబ్బ! ఏం తెలీదు పాపం..."

"నిజంగా" అతని పిచ్చి చూపులు ఆమెకు భయాన్ని కలిగించాయి.

"కవ్వించడం మీ అడాళ్ళ సొత్తుసుమా" అంటూ ధైర్యంగా చెయ్యి పట్టుకున్నాడు.

"మాష్టారూ, మీరిలాంటి వారనుకోలేదు- నేను మీ చెల్లెలు లాంటిదాన్ని" విదుల్చుకొని దూరంగా నిలబడింది. ఆమె మొహం, కళ్ళు ఎర్రబడినాయి.

వార్నింగ్ యిచ్చి ఆ తర్వాత కళ్ళ నీళ్ళు పెట్టుకొని వెళ్ళిపోతుండగా- ఆ పత్రికలో ప్రశ్న చూసి తప్పు- నా కలాంటి దుర్బుద్ధిలేదనీ- నా పరువు బజారుపాలు చెయ్యొద్దనీ ప్రాధేయపడ్డాడు వరదరాజు.

వంట్లో బాగోలేదని- కాలేజీకి రెండు రోజులు సెలవుపెట్టి- ఊళ్ళో దీపావళి బాణ సంచాలాంటిదేమీ కాలడం లేదని నిర్ధారించు కొన్న తర్వాత మళ్ళీ కళాశాల ఆవరణలో అడుగుపెట్టాడు వరదరాజు!

అప్పటికి అర్థమయింది రాజుకి- "ఎం. ఏ. అనే అమ్మడు ఆ కళాశాలలో లేదు, అది ఎవరో కుర్రాడు రాసిన కొంటె ఉత్తరంఅయి వుండాలని!"

అదేదో అక్కడికేవెళ్ళి తేల్చుకోవాలని కసితో. పట్టుదలతో కాలేజీకి సెలవుపెట్టి- 200 కి.మీ. దూరం ప్రయాణంచేసి 'తెలుగు పున్నమి' కార్యాలయానికి వెళ్ళాడు. వెళ్ళిన తరాత 'ఎడిటోరియల్' రూమ్‌దగ్గర ఆగి,

అనుకున్నాడు. ఆవేశంతో వచ్చాను కాని- ఈ విషయం ఎవరి నడగాలి? ఇటువంటి రహస్యాలు ఎవరూ చెప్పరు కదా?' అని దిక్కు తోచక గుమ్మం దగ్గర తచ్చాడుతున్నాడు వరదరాజు.

"హాయ్, రాజూ" పలకరించిన కంఠం రామకృష్ణది. అతను బి.ఏలో రాజు క్లాస్‌మేట్. అప్పుడే కథలూ, కాకరకాయలూ రాసేవాడు.

"ఏవిటిలా వచ్చావ్, ఏ వైనా కలూథ గట్రా రాస్తున్నావా?"

"అదేం లేదు కాని నువ్వేం చేస్తున్నావ్?"

"నేనీ పత్రికలో సబ్‌ఎడిటర్‌గా పన్చేస్తు న్నాను- రా, టీ తాగి వద్దాం" అంటూ బయటికి దారితీశాడు రామకృష్ణ.

రోడ్డుమీద నడుస్తుండగా కొంత పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత వరదరాజు ఎం. ఏ. ఉత్తరం విషయం కదలేశాడు.

"ఓహ్... అదా? ఆ వారం ఆ శీర్షికకు సరిపడినన్ని ప్రశ్నలు రాక జ్ఞాన ప్రసూనాంబగారి సూచనమీద రెండు, మూడు ప్రశ్నలు నేనే తయారు చేసి యిచ్చాను. నిజానికి ఆనంద పురం అనే ఊరు పేరే నాకు తెలీదు... ఎం. ఏ. అంటే మిస్ అపురూప అని. అపురూప అంటే తెలుగులో..." ఆ తర్వాత రామకృష్ణ చెపుతున్నదేమీ వినిపించలేదు వరదకి! *

## తెలుగు సినిమాలు...

"ఇంటికి దూరపు బంధువు లొచ్చారని చెప్పావ్ కనబడరేం?"

"ఆ ఏమి లేదు: ఖాళీగా వున్నారు కదా అని ఓ మూడు తెలుగు సినిమాలు చూపించానంతే"

-సీతారామాంజనేయులు

చీరాల


# రు. 40000 విలువచేసే బహుమతులు గెలవండి

**HIND SALES announce this Sales Promotion Plan to popularise their products.**

1వ బహుమతి యెజ్డి మోటారు సైకిలు లేదా రు. 13,000 నగదు.

రెండవ బహుమతులు కలర్ టీవీ లేదా రు. 9,000 నగదు ఒక్కొక్కటి.

మూడవ బహుమతులు • తగ్గింపు ధర రు.500/-కు మూడు స్పీడ్‌లుగల మిక్సర్-కమ్-గ్రైండర్‌లు./

• తగ్గింపుధర రు. 325/-కు రెండు స్పీడ్‌లుగల మిక్సర్-కమ్-గ్రైండర్‌లు. OR TAPE RECORDER

• తగ్గింపుధర రు. 225/-కి రెండు బ్యాండ్‌ల ట్రాన్సిస్టర్‌లు. OR TWO-IN-ONE AT REDUCED RATE RS. 900/-

ఈ క్రింది మూడు లైనులలో మేము పదకొండునుంచి 19 వరకు అంకెలను. ఎటునుంచి కూడినా మొత్తం నలభైఅయిదు వచ్చే విధంగా ఉపయోగించాము.

పన్నెండు పదిహేడు పదహారు
పంథొమ్మిది పదిహేను పదకొండు
పద్నాలుగు- పదమూడు పద్దెనిమిది

మీరు చేయవలసినది :- అదే విధంగా మీరు పన్నెండు నుంచి ఇరవై వరకు అంకెలను మూడు లైనులలో ఎటు వైపు నుంచి కూడినా నలభై ఎనిమిది వచ్చే విధంగా ఉపయోగించవచ్చును ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి




మీ ఎంట్రీలను, తెల్లకాగితం పైన, లేదా పోస్ట్ కార్డు పైన ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రం వ్రాసి 15 రోజులలోగా పంపించండి. ఎక్కువ మంది ఎవరిని ఎంపిక చేసుకుంటారో దానిని ఒక్క కరెక్టు పరిష్కారాన్ని నిర్ధారిస్తారు. ఆ వారంలో అందిన కరెక్టు ఎంట్రీల ఆధారంగా ప్రతి వారం తగ్గింపు ధరలకు బహుమతులను యిస్తారు. విజేతలకు పోస్ట్ ద్వారా తెలియజేస్తారు. జడ్జిల నిర్ణయం తుది నిర్ణయం. అన్ని వివాదాలు ఢిల్లీ న్యాయస్థానం పరిధికి లోబడి ఉంటాయి.



**HIND SALES CORPORATION(TL)**
**POST BAG NO. 1, SAROJANI NAGAR N. DELHI-110023**